క్లుప్తంగా

తొలి రోజే నూరు శాతం పంపిణీ చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

అల్లవరం: మండలంలోని 23 సచివాలయాల పరిధిలోని 9,540 మంది లబ్ధిదారులకు ఆగస్టు 1వ తేదీనే నూరు శాతం పింఛన్లు పంపిణీ జరగాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో పింఛన్ల పంపిణీ బాధ్యతను 166 మంది సిబ్బందికి కేటాయించామన్నారు. తొలి రోజునే వంద శాతం పంపిణీ కావాలని, సాంకేతిక సమస్యలుంటే అధికారిక గ్రూప్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీల్‌కుమార్, ఈఓపీఆర్‌డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో వరద వల్ల నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు భవిత ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు పీవీవీవీ వరప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి చేతుల మీదుగా దుప్పట్లని పంపిణీ చేశారు. తొలుత వరద ప్రాంతాన్ని పరిశీలించి 350 మంది వరద బాధితులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కిరణ్‌బాబు, పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం



ఉచిత గుండె వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రవికాంత్

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ కల్యాణ మండపంలో ఉచిత గుండె వైద్య శిబిరం మంగళవారం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, లయన్స్ క్లబ్ ప్రతినిధి వజ్రపు కోటేశ్వరావు, హైదరాబాద్ యశోద హాస్పటల్ హృద్రోగ వ్యాధుల నిపుణుడు డాక్టర్ అత్తలూరి రవికాంత్‌లు ఉచిత శిబిరంలోని వివిధ వైద్య విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికాంత్ గుండె విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో 175 మంది రోగులకు బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలను ఉచితంగా చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి అప్పన హరిప్రసాద్, సలహాదారు నంబూరి విశ్వనాథం, కో ఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్యా థియేటర్ అధినేత కొండలరాయుడు కన్నుమూత



కొండలరాయుడు

తాళ్లరేవు: నీలపల్లి సత్యా థియేటర్ అధినేత, ప్రముఖ వ్యాపారవేత్త ఉంగరాల కొండలరాయుడు(76) అలియాస్ బాబ్జి సోమవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కాకినాడ ట్రస్ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నారు. థియేటర్‌లో కొండలరాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతికి థియేటర్ ప్రతినిధులు అనుశ్రీ సత్యనారాయణ, బ్రాహ్మాజీ, కర్నీడి ఈశ్వరరావు, మేనేజర్ సంగాడి శ్రీనివాస్, సిబ్బంది తమ సంతాపాన్ని తెలియజేశారు. కొండలరాయుడు సుమారు 40 ఏళ్ల క్రితం 1983లో సత్యా థియేటర్‌ను నిర్మించి నేటికీ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. థియేటర్‌ను నిర్మించాక మొదటిగా మెగాస్టార్ చిరంజీవి నటించిన శివుడు శివుడు శివుడు సినిమాను రిలీజ్ చేసి సంచలనం రేకెత్తించారు. సమీపంలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో ఉన్న థియేటర్‌లకు దీటుగా సినిమాలను తీసుకొచ్చి పోటాపోటీగా నడిపేవారని పలువురు కొనియాడారు.

భోజన పథకం ప్రారంభం

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ప్రారంభమైంది. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయుల బృందం ఈ పథకాన్ని నిర్వహించింది. అనేక మంది దాతలు తమ వంతు సహకారంగా మిఠాయిలను అందజేశారు.

గోదావరి తగ్గుముఖం

- లంక గ్రామాలను వీడుతున్న వరద నీరు
- ఊపిరి పీల్చుకుంటున్న ముంపు ప్రాంతాల ప్రజలు

ఐ.పోలవరం: గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. పన్నెండు రోజులు ఏటిగట్టు దిగువన ఉన్న లంక వాసులను ఇబ్బందులు పాల్జేసిన వరద తగ్గుముఖం పట్టడంతో ముంపువాసులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మండల పరిధిలోని మురమళ్ల, కేశనకుర్రు, గుత్తెనదీవి, ఎదుర్లంక, పాత ఇంజరం, కొమరగిరి, పశువుల్లంక గ్రామాల్లో ముంపు చాలా వరకూ తగ్గింది. ఇళ్ల మధ్య నీరు తగ్గుతుండడంతో ఆయా నివాస ప్రాంత వాసులు బురదను వదుల్చుకునే పనిలో పడ్డారు. వరి చేలల్లో సైతం ముంపు తగ్గుతోంది. వరదలకు మండల పరిధిలో 1,309 కుటుంబాలు నిరాశ్రయులైనట్టు ప్రత్యేకాధికారి పీకేపీ ప్రసాద్ తెలిపారు. వీరిలో 979 కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందించామని, ఇంకా 330 కుటుంబాలకు అందించాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు ఆయన తెలిపారు. 2,090 పశువులకు 29 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందని నివేదించినట్టు ఆయన తెలిపారు. కొమరగిరి గ్రామంలో వరద బాధితులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు చేతుల మీదుగా నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్‌లు పాల్గొన్నారు. మండల పరిధిలో కేశనకుర్రు పల్లిగూడెం, పొగాకులంక, అరుంధతి నగర్‌లో ముంపు బాధితులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు పరామర్శించారు. ఆయన వెంట ఇందుకూరి రంగరాజు, మోకా రవి, చెల్లి రమాదేవి ఉన్నారు.

ముమ్మిడివరం: గోదావరి శాంతించడంతో లంక గ్రామాలను వరద నీరు నెమ్మదిగా వీడుతోంది. గోదావరిలో వరద ఉధృతి నెమ్మదించడమే కాకుండా మంగళవారం సాయంత్రం సమయానికి నాలుగు అడుగుల మేర నీటి మట్టం తగ్గినట్లుగా అధికారులు చెబుతున్నారు. దీంతో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ముమ్మిడివరం మండలంలో వివేకానంద వారధి, గురజాపులంక, ప్రధాన రోడ్లు చాలా వరకూ వరద నీటి నుంచి బయటపడ్డాయి. కూనాలంక, రామాలయం, గురజాపులంక తుఫాన్ షెల్టర్, సమీపంలో కొంత మేర రోడ్డు ఇంకా వరద నీటిలో ఉంది. అంతర్గత రోడ్లకు ముంపు బారి నుంచి విముక్తి లభించింది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. మండల ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, వీఆర్వోలు లంక గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు.



దరియాలతిప్ప ఆయకట్టులో ముంపునకు గురైన పొలాలు

పీడబ్ల్యూడీ శాఖ తీరుపై రైతుల ఆగ్రహం

యానాం: నియోజకవర్గ పరిధిలో గోదావరి వరదలకు ముంపునకు గురైన పంట పొలాల్లో నీటిని తోడేందుకు మోటార్లు ఏర్పాటు చేయలేదంటూ పీడబ్ల్యూడీ శాఖ అధికారులపై దరియాలతిప్ప తదితర గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆదివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి సమక్షంలో జరిగిన సమావేశంలో ముంపు పొలాల్లో నీటిని తోడేందుకు మోటార్లు ఏర్పాటుచేస్తామంటూ హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ పంట పొలాలన్నీ కాలువల్లా మారిపోయాయని, ముంపు నీటిని తొలగించేలా మోటార్లు పెడితే తిరిగి వ్యవసాయ పనులు చేసుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా పీడబ్ల్యూడీ శాఖ ఏఈ నాగరాజు ఎమ్మెల్యే మాటను సైతం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మోటార్లు పెట్టమంటే వైర్లు తదితర సామగ్రి రైతులే తెచ్చుకోవాలంటున్నారని ఇది ఎంతవరకు భావ్యమని వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు చెడ్డపేరు తేవాలనే లక్ష్యంతోనే అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు సబ్బతి లోకేశ్వరరావు, తిరుకోటి భైరవమూర్తి, మట్టా రాంబాబు, సబ్బతి రాంబాబు, వాకపల్లి సుబ్బారావు, కోరుకొండ అప్పన్న, ఎడ్ల లోవరాజు, కోరుకొండ ఆనందరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పిల్లంక పంచాయతీ కొత్తలంక గ్రామానికి చెందిన వరద బాధితులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. సోమవారం కొత్తలంక గ్రామంలో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కంది పప్పు, ఆయిల్ ప్యాకెట్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారి లావణ్య, డీటీ సూరిబాబు, ఆర్ఐ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితులకు దుప్పట్లు అందజేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి



కొత్తలంకలో వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే దాట్ల

బాలికల హాస్టల్ వద్ద పారిశుధ్య పనులు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ వద్ద సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. హాస్టల్ పరిసరాలలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు వర్షపు నీరు నిలువ ఉండి దుర్గంధంగా తయారైంది. దీంతో చెత్తాచెదారాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. అలాగే దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అరిగెల నానాజీ, గుత్తుల సుభాష్ చంద్రబోస్, చీకట్ల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.



గొల్లవిల్లి వసతి గృహం వద్ద పారిశుధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

టెడ్ పరికరంపై అవగాహన

యానాం: స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ హాలులో ది మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ(ఎంపెడా) ఆధ్వర్యంలో స్థానిక మత్స్యకారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆర్ఏఓ మునిస్వామి మంగళవారం ప్రారంభించారు. వేట సమయంలో చేపలతో పాటు వలలో చిక్కుకున్న తాబేళ్లు సురక్షితంగా బయటపడటానికి వీలుగా రూపొందించిన టర్టిల్ ఎక్స్‌క్లూడర్ డివైజ్(టెడ్) పరికరంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపెడా స్టేట్ కోఆర్డినేటర్ హనుమంతరావు మాట్లాడుతూ టెడ్ పరికరం వల్ల తాబేళ్ల ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని వివరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ గొంతియ్య తదితరులు పాల్గొన్నారు.



టెడ్ పరికరంపై శిక్షణలో పాల్గొన్న మత్స్యకారులు

భయం గుప్పిట లంక గ్రామాలు

పి.గన్నవరం: కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. ధవళేశ్వరం వద్ద వరద తగ్గుముఖం పట్టినప్పటికీ, భద్రాచలం వద్ద మళ్లీ స్వల్పంగా వరద పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికే పది రోజులుగా లంక గ్రామాల ప్రజలు వరదతో ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక, మానేపల్లి శివారు శివాయలంక, వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి కొనసాగుతోంది. కె.ఏనుగుపల్లి రహదారిపై ఇంకా వరదనీరు ప్రవహిస్తోంది.

రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ఊడిమూడిలంక వద్ద వరద బాధితులకు మంచినీటి ప్యాకెట్ల బస్తాలు తరలిస్తుండగా జరిగిన పడవ ప్రమాదంలో చదలవాడ విజయకృష్ణ మృతి చెందిన నేపథ్యంలో, అతడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన వరదలకు మానేపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు మృతిచెందగా, వారి కుటుంబాలకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.10 లక్షల వంతున తక్షణ ఎక్స్‌గ్రేషియా అందించిందని గుర్తు చేశారు. అయితే విజయకృష్ణ కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.5 లక్షలు మాత్రమే ఇవ్వడం సమంజసంగా లేదన్నారు. అలాగే అయినవిల్లిలంకలో ప్రమాదవశాత్తు గోదావరిలో పడి ఓ వ్యక్తి మరణించగా, అతడి కుటుంబానికి కూడా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని చిట్టిబాబు డిమాండ్ చేసారు.

అసభ్యకర దూషణలపై ఫిర్యాదు

కాట్రేనికోన: పల్లంకుర్రు శివారు సాపేవారిపల్లి జెడ్పీహెచ్ పాఠశాలలో స్కూల్ కిట్ల పంపిణీలో పాల్గొన్న తనపై, తన భర్త నాతి సత్యనారాయణపై నిరాధార ఆరోపణలు, అసభ్య పదజాలంతో దూషణలు చేసిన టీడీపీ కార్యకర్త గెడ్డం చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ నాతి అలివేణి మంగళవారం తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయ శిక్షణ

రావులపాలెం: ఉపాధ్యాయుల్లో మార్గదర్శకత్వ ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన శిక్షణ మంగళవారం ముగిసింది. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభమైన ఈ శిక్షణ మంగళవారం సాయంత్రం వరకూ కొనసాగింది. ఈ శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-2 పి.శ్రీనివాసరాజు సూచించారు. ముగింపు సమావేశంలో ఆయనతో పాటు, సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఐఈ కో-ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 53 పాఠశాలలను మెంటారింగ్ స్కూళ్లుగా గుర్తించారన్నారు. ఆయా పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా టీచర్ మెంటారింగ్‌ను చేపట్టినట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా టీచ్ టూల్ ట్రెనింగ్ పొందిన 42 మంది సర్టిఫైడ్ అబ్జర్వర్లను టీచర్ మెంటార్స్‌గా ఎంపిక చేసి, వారికి రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారన్నారు. తద్వారా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను మెరుగుపర్చేందుకు సాయపడుతుందని రాంబాబు తెలిపారు. విజయవాడ నుంచి వచ్చిన ఎల్ఎఫ్ఈ టీమ్ సభ్యులు క్రాంతికుమార్, షామి, కిషన్ శిక్షణ ఇచ్చారు.

ఫ్రెంచి కాలం నాటి రోడ్లు.. ప్రజల పాట్లు



యానాం ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌తో ప్రజల తిప్పలు



రోడ్డు పక్కనే మోటారు సైకిళ్లు నిలిపేస్తున్న వాహనదారులు

- యానాంలో అమలు కాని మాస్టర్ ప్లాన్
- ట్రాఫిక్ అంతరాయంతో తీవ్ర ఇబ్బందులు
- రోడ్లు వెడల్పు చేసేదెప్పుడని ప్రశ్నిస్తున్న స్థానికులు

యానాం: కేంద్రపాలిత ప్రాంతం యానాంలో ఇప్పటికీ ఫ్రెంచి కాలం నాటి ఇరుకిరుకు రోడ్లనే కొనసాగిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా కూడళ్లలో 20 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డు కూడా కనిపించదు. పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలుచేసి రోడ్లను వెడల్పు చేయాలన్న డిమాండ్ దశాబ్దాల తరబడి ఉన్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. కేవలం ఇరుకిరుకు రోడ్లు, కూడళ్ల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుని అనేకమంది మృత్యువాత పడుతున్నారు. మరోవైపు యానాంలో మద్యం తక్కువ ధరకు లభిస్తుందని రోజూ వేలాదిమంది మందుబాబులు ఇక్కడకి వస్తుంటారు. యానాం జాతీయరహదారి బైపాస్ సెంటర్‌లో ఎక్కువగా మద్యం షాపులు, బార్‌లు ఉండటంతో రోజూ వందలాది వాహనాలు వస్తుంటాయి. ఆ ప్రాంతమంతా రాత్రి, పగలు అన్న తేడా లేకుండా కిటకిటలాడుతుంది. మందుబాబులకు అవసరమైన వివిధ ఆహారపదార్థాల దుకాణాలు, మొబైల్ వాహనాలు సైతం బైపాస్ రహదారి చెంతనే పెట్టేస్తుండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో యానాంలో రోడ్లు ఎప్పుడు వెడల్పు చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాల్ అధికారులు ఎప్పటికప్పుడు మాస్టర్ ప్లాన్ అమలుచేస్తామని చెప్పడమే తప్ప అది ఆచరణలో చూపించడం లేదంటూ పట్టణవాసులు మండిపడుతున్నారు.

నలుదిక్కుల నుంచి రాకపోకలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సరిహద్దుగా 30 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న యానాం ప్రాంతానికి వివిధ ప్రదేశాల నుంచి వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా అమలాపురం, కాకినాడ, విశాఖపట్టణం, రాజమహేంద్రవరం, రాజోలు, రామచంద్రపురం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుంటాయి. అదేవిధంగా రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థలు పక్కనే ఉండటంతో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, పుదుచ్చేరి తదితర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లు, కంటైనర్లు వంటి భారీ వాహనాలు సైతం వస్తుంటాయి. ఈ నేపథ్యంలో పలు వాహనాలు యానాం పట్టణంలో వివిధ ప్రాంతాల మీదుగా వెళుతుండటంతో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది.

ఇదీ పరిస్థితి

- పట్టణ పరిధిలో పాత బస్టాండ్ సెంటర్ నుంచి గొలగాబత్తుల వీధి, అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల మీదుగా న్యూబస్టాండ్‌కు వాహనాలు చేరుకుంటాయి. అయితే ఈ దారిలోని రోడ్లలన్నీ బాగా ఇరుకుగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతుంది. కేవలం ఇరుకిరుకు రోడ్ల కారణంగా ఒక వాహనం వెళ్లే వరకూ మరో వాహనం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది.
- ప్రధాన కూడళ్లలో సైతం ద్విచక్ర వాహనాలను రోడ్లకు ఇరువైపులా పెట్టేస్తుండడంతో బస్సులు సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది.
- యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉంటుండటంతో మందుబాబులు అధికంగా యానాం వస్తుంటారు. దీంతో ముఖ్యంగా పాత బస్టాండ్ సెంటర్ పక్కనే ఉన్న మద్యం షాపులు, పిల్లారాయవీధి తదితర ప్రాంతాల్లో మందుబాబులు తమ వాహనాలను రహదారిపైనే పార్క్ చేసేస్తుండడంతో వాహనాలు ఎటూ వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది.
- బైపాస్ రహదారి పక్కనే బ్రాందీ షాపులు, తినుబండారాల దుకాణాలు ఉండడం సమస్యను మరింత పెంచుతోంది. దీనికి తోడు తక్కువ ధరకు వస్తుందని పెట్రోల్, డీజిల్‌కు వచ్చే వాహనాలు సైతం గంటల తరబడి నిలిపివేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లతో పోలిస్తే యానాంలో జనసంచారం విపరీతంగా పెరిగిందని మున్సిపల్ అధికారులే ఒప్పుకుంటున్నారు. అయినా నిధుల కొరతతో యానాంలో మాస్టర్ ప్లాన్ అమలు, రహదారుల వెడల్పుపై ముందడుగు పడడం లేదని అధికారిక వర్గాల ద్వారా తెలుస్తుంది.

చర్యలు తీసుకుంటున్నాం



యానాంలో ట్రాఫిక్ నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. నూతనంగా ట్రాఫిక్ సిగ్నళ్లు సైతం ఏర్పాటుచేశాం. హెల్మెట్ ధరించాలని వాహనదారుల్లో చైతన్యం కలిగిస్తున్నాం. రోడ్లు వెడల్పు చేయగలిగితే ఇబ్బందులు తగ్గుతాయి.

– శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్ఐ

డ్రైనేజీలను మెరుగుపరచాలి

యానాం: యానాం, కారైకల్, పుదుచ్చేరి, మాహే ప్రాంతాల్లో డ్రైనేజీలను మెరుగుపరచాలని కోరుతూ పీడబ్ల్యూడీ చీఫ్ ఇంజినీర్ దీనదయాళన్‌కు బీజేపీ సోషల్ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌రెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కుంటల్లో పూడికతీత, మురుగునీటి తరలింపు, భూగర్భ డ్రైనేజీల పునర్నిర్మాణం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో శక్తివేలు, సెల్వకుమారన్, హరికృష్ణన్, అరుణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

యానాం: పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈ మేరకు స్పీకర్ సెల్వం బడ్జెట్ సమావేశాలకు సంబంధించి వివరాలను విడుదల చేశారు. యథావిధిగా ప్రస్తుత ఎల్జీ రాధాకృష్ణన్ బుధవారం జరిగే సమావేశానికి హాజరై ప్రసంగిస్తారన్నారు. అనంతరం నూతన ఎల్జీగా నియమించబడిన కైలాష్‌నాథన్ ఈ నెల 2న బడ్జెట్ సమర్పణ సెషన్‌లో పాల్గొంటారన్నారు. అదే రోజు రాధాకృష్ణన్‌కు వీడ్కోలు సభ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

పర్యావరణ సమితి కో ఆర్డినేటర్‌గా అనిత

యానాం: పర్యావరణ పరిరక్షణ సమితి యానాం కో ఆర్డినేటర్‌గా సోషల్ యాక్టివిస్ట్ దుగ్గదుర్తి అనితను నియమిస్తూ సమితి జాతీయ అధ్యక్షుడు టి.చెంగళరావు మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తనకు ఉత్తర్వులు అందాయని అనిత విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ముఖ్యంగా మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా కృషి చేస్తానన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యానాం: స్థానిక కనకాలపేటకు చెందిన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కవల గణపతి మంగళవారం తెలిపారు. శిబిరంలో 12 మంది అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని యానాం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జూనియర్ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరిలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 218 గ్రూప్-బీ జూనియర్ ఇంజినీర్(సివిల్) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి పి.ఇజమోలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు డిప్లొమో, బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ చేసి ఉండాలని, వయసు 30 ఏళ్లు దాటకూడదన్నారు. మరిన్ని వివరాల కోసం రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ ' వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. 20 ఏళ్ల తరువాత నోటిఫికేషన్ పడిన నేపథ్యంలో జూనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, ఎంబీసీ అభ్యర్థులకు వయో పరిమితిని సడలించాలని స్థానికులు కోరుతున్నారు.

ఓహెచ్‌ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన



రోళ్లపాలెంలో ఓహెచ్‌ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఓహెచ్‌ఆర్ నిర్మాణానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్ట వైదేహి, ఎంపీటీసీ నేదునూరి నాగరత్నం, ఉపసర్పంచ్ సింహాచలం, జయ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

ముమ్మిడివరం: ఠానేల్లంక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్రంలోనే నంబర్ వన్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. మంగళవారం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ డి.భవాని అధ్యక్షతన జరిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు,, తాడి నరసింహరావు, అర్థాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

అయినవిల్లి: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో మెలగాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై వి.రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఆయన వివిధ కళాశాలల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. అశ్లీల ప్రదర్శనలు, మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలు కారాదన్నారు. అలాగే చట్టాలపై పూర్తి అవగాహనతో మెలగాలన్నారు. త్వరలోనే విద్యార్థులకు కళాశాలల వారీగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.